Int. J. Adv. Multidiscip. Res. (2024). 11(11): 51-55

International Journal of Advanced Multidisciplinary Research
ISSN: 2393-8870
www.ijarm.com
(A Peer Reviewed, Referred, Indexed and Open Access Journal)
DOI: 10.22192/ijamr Volume 11, Issue 11 -2024

పరిశోధన వ్యాసం

DOI: http://dx.doi.org/10.22192/ijamr.2024.11.11.006

# వెన్నెల చెప్పిన కథ- సాహిత్య ధోరణుల అధ్యయనం

**డా. తన్నీరు సురేశ్,**
సహాయ ఆచార్యులు(తెలుగు),
ప్రభుత్వ కళాశాల, లక్షెట్టిపేట.
జిల్లా: మంచిర్యాల, తెలంగాణ రాష్ట్రం
E-mail *sureshphd2007@gmail.com*
చరవాణి: 8790569436

**పరిచయం:** వర్తమాన తెలుగు స్త్రీ రచయితల్లో శరత్ జ్యోత్స్నారాణి గారిది ప్రముఖ స్థానం. వారు సృజన కారురాలు, విమర్శకురాలు, ఆచార్యులు, ఉద్యమ నాయకురాలు , సాహిత్య సంస్థల నిర్వాహకురాలు , సంఘ సేవకులు అన్నింటినీ మించి మానవతావాది. శరత్ జ్యోత్స్నా రాణి సాహిత్య నేపథ్యం కలిగిన జ్ఞానానంద కవి కూతురు కావడం, ప్రముఖ నవలా రచయిత ఆనందారామం శిష్యురాలు కావడం మాత్రమే కాకుండ స్వయంగా ఉద్యమాలు నడిపిన అనుభవం, సమాజాన్ని దగ్గరగా చూసి సూక్ష్మపరిశీలన ద్వారా సమస్యల మూలం తెలిసిన మానవతావాది కావడం వలన ఆమె కథల్లో ఉన్నతమైన ఆదర్శాలు, సాహిత్య ధోరణులు వ్యక్తం అవుతాయి. పరిణతి చెందిన సాహిత్య సృజన ఆమె సొంతం. సమాజాన్ని , సాహిత్యాన్ని మేళవించి ఒక ఆదర్శ వ్యక్తిత్వ నిర్మాణం కోసం తపించిన జ్ఞానశీలి శరత్ జ్యోత్స్నారాణి. శరత్ జ్యోత్స్నా రాణి రాసిన 'వెన్నెల చెప్పిన కథ' కథా సంపుటిలో సాహిత్య ధోరణులు అధ్యయనం చేయడం నేటి అవసరంగా భావించి ఈ పరిశోధన పత్రం రాయడం జరుగుతుంది.

**శరత్ జ్యోత్స్నా రాణి పరిచయం:** శరత్ జ్యోత్స్నారాణి ప్రముఖ కవి ఎస్.టి.జ్ఞానానంద కవి, సుగుణమణి దంపతులకు కాకినాడ పట్టణంలో జన్మించారు. అన్నవరం సత్యాదేవి కళాశాల, నాగార్జున విశ్వవిద్యాలయం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వరుసగా బి.ఏ.ఎం.ఏ. ఎంఫిల్. పి.హెచ్.డి పూర్తి చేశారు. వీరు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో 1991సం.లో అధ్యాపకురాలిగా ప్రవేశించి తెలుగు విభాగం అధిపతిగా, మానవీయ విభాగం డీన్ గా పనిచేసి పదవి విరమణ పొందారు. వీరు ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్ గా కుడా పనిచేశారు.

స్వయంగా జ్యోత్స్నా కళాపీఠం పేరుతో సాహిత్య సంస్థను స్థాపించి నిర్వహిస్తున్నారు. సామజిక ఉద్యమాలలో పాల్గొన్నారు. వీరి రచనలు ఇంగ్లీష్, హిందీ భాషలలోకి అనువాదం కుడా అయ్యాయి. అనేక పురస్కారాలు సత్కారాలు పొందారు సాహితీ యువరత్న, భారత భాషా భూషణ్ అనే బిరుదులు లభించాయి.

**శరత్ జ్యోత్స్నా రాణి గారి రచనలు :** విస్తారమైన రచనా వ్యాసంగం శరత్ జ్యోత్స్నా రాణిసొంతం.వీరి రచనలు **కవిత్వం:** కొత్త పాట, కవన మందాకిని, అక్షర వసంతం (మినీ కవితలు), **కథలు:** నీకూ నాకూ నడుమ. వెండి కిరీటం, వెన్నెల చెప్పిన కథ, **పరిశోధన గ్రంథాలు :** ఎల్లోరా రచనలు సమగ్ర పరిశీలన, డా. జ్ఞానా నంద కవి జీవితం , వాజ్మయ సూచి , సాహితీ సౌరభం (వ్యాస సంపుటి) , సాహితీ మూర్తుల ప్రశస్తి, రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ జిల్లా బతుకమ్మ పాటలు సామాజికాంశాల పరిశీలన, స్వాతంత్రనంతర తెలుగు కవిత-వస్తువు, రూపం, శిల్పం వ్యాస జ్యోత్స్న (వ్యాస సంపుటి) తెలుగు విమర్శకులు విమర్శన రీతులు

**పరిశోధనా అంశం విషయ వివరణ :** వెన్నెల చెప్పిన కథ సంపుటి జ్యోత్స్న కళా పీఠం ద్వారా 2019 సం.లో వెలువడింది. ఇందులో మొత్తం 17 కథలు ఉన్నాయి. **"కథ వినుడు అంటే జీవితం వినడమే. కథలు రాయడం ఒక బాధ్యత కథలు, చదవడం అంతే బాధ్యత. ఒక సామాజిక సందర్భం నుండి మరొక సామజిక సందర్భంలోకి మనిషి చేసే ప్రయాణానికి ప్రతీకలు కథలు"** అంటాడు వాసిరెడ్డి నవీన్.

**కథా వస్తువులు:** ఈ సంపుటిలోని కథల్లో కథా వస్తువులు సమాజంలోని నిత్య జీవితం నుండి గ్రహించినవి. సామాన్యుడి మధ్యతరగతి మానవ జీవితం ఇచ్చిన అనుభవాలే ఈ కథలకు మూలం. కథా వస్తువులలో స్త్రీ యొక్క వేదన, పనిభారం, శ్రమ దోపిడీ బంధాల అందము, అనందం, దుఖం, విస్మరణ కనిపిస్తుంది. తెలంగాణ వాదం కొత్తగా ఆవిష్కృతమయ్యే కథా వస్తువులూ ఉన్నాయి. కులాలు, అంతరాలు, కులాంతర వివాహాలు వాటి ద్వారా ప్రభావమయ్యే మానవ జీవిత ప్రయాణం ఇందులో కనిపిస్తాయి. ఆధునిక అపార్ట్ మెంట్ జీవితం ద్వారా కలిగే నూతన సామజిక సమీకరణలు కనిపిస్తాయి. మానవ బంధాల ఆత్మీయ స్పర్శను, దాని నిర్లక్ష్యం చేసే కొన్ని వికృత చేష్టలను ఈ కథలు పట్టి చూపుతాయి. ప్రతి కథ ఒక ప్రశ్నను పాఠకునిపై విసిరి తన బాద్యత ఏమిటి అన్నట్లు చూసే మనుషుల్లా ఇవి కనిపిస్తాయి.

**పాత్రల చిత్రణ:** వెన్నెల చెప్పిన కథ సంపుటిలో శరత్ జ్యోత్స్నారాణి రూపొందించిన పాత్రలు అన్నీ సజీవమైన ఆత్మరూపాలు, సమాజంలో మన చుట్టూనే తిరుగాడే వ్యక్తులు. ఒక్కో వ్యక్తి నుండి శరత్ జ్యోత్స్నా రాణికి ఎదురైనా అనుభవాలు, ఆమె పరిశీలనకు వచ్చిన సంఘటనల నుండే పాత్రలను తీసుకున్నారు. ప్రతి పాత్రకు వాస్తవికతే ఆధారం కానీ ఊహా కాదు కల్పన కాదు. శరత్ జ్యోత్స్నా రాణి రోడ్డుపై, షాప్ లో, కార్యాలయంలో, ఆమె తిరిగే సమాజంలో, ఆమెకు ఎదురయ్యే వ్యక్తులే ఇందులో పాత్రలుగా మారారు . పాత్రలను రూపొందించడంలో శరత్ జ్యోత్స్నారాణి కొత్త విధానాన్ని అనుసరించారు. పాత్రకి ప్రత్యేకత లేకుండా కథా వస్తువును ఇతివృత్తమే కేంద్రంగా పాత్ర నడుస్తున్నట్లు ఉంటుంది. కానీ అంతరంగ ఆవిష్కరణ ద్వారా మానవ వేదన చిత్రణ ద్వారా ఒక పాత్రకి మరో పాత్ర ఇచే ఓదార్పు ద్వారా పాత్రల ఏర్పాటులో ఔన్నత్యం చూపించారు. కథ బలం పాత్ర ద్వారే తెలుస్తుంది. పాత్రల్లో ఎక్కువగా జానకీ సీత అనే పేర్లు కనిపిస్తాయి. స్త్రీల పాత్రలపై పురుష పాత్రల ఆధిపత్యం ఎక్కువ చూపడం ద్వారా ఇతివృత్తానికి బలం పెంచారు. అన్యోన్య దాంపత్యాన్ని చూపించే క్రమంలో స్త్రీ అనురాగ ఆవిష్కరణ చూడవచ్చు.

**సాహిత్య ధోరణులు:** వెన్నెల చెప్పిన కథ సంపుటిలో స్త్రీవాద ధోరణి, మానవతా ధోరణి, దళిత వాద ధోరణి ఇతర ధోరణులు కనిపిస్తాయి. మానవ బంధాలను ఆవిష్కరించడంలో నూతన ధోరణి వ్యక్తం అవుతుంది.

స్త్రీ వాద ధోరణికి ఈ కథలు ఎక్కువ విలువ ఇచ్చాయి. ముందుమాటలో విహారి చెప్పినట్లు "స్త్రీ ఉనికి, అస్తిత్వం,చేతన, మనుగడలోని ఆపేక్షలు, వ్యక్తిగా, సమాజ సభ్యురాలిగా వివిధ, పాత్రల్లో ఆమె ఎదుర్కొంటున్న కుటుంబ పరమైన, దాంపత్య సంబంధమైన వివక్షలు, విచారణలు, అణిచివేతా పురుషాహంకార ప్రభావాలు, పర్యవసానాలు ఇలా అనేకానేక సంక్లిష్టమైన సమస్యల జ్వాలాతోరణాన్ని పాఠకుల ముందుంచారు శరత్ జ్యోత్స్నా రాణి " (పు.8)

**పొద్దుతిరుగుడుపువ్వు** కథలో రెండవ వివాహం చేసుకున్న రంగారావు ఆదర్శ కథారచయిత, ఆచార్యుడు. కానీ తాను వివాహం చేసుకున్న జానకి కేవలం తన అవసరాలు తీర్చే పనిమనిషిగా స్వేచ్ఛ లేని బానిసలా ఉండాలని ఆశిస్తాడు. జానకి గర్భాన్ని అబార్షన్ చేసుకోమని హెచ్చరిస్తాడు. అలాంటి రంగారావును వదిలి జానకి తనదైన జీవితాన్ని బ్రతకడానికి బయటకు వస్తుంది. రెండవ వివాహాల్లో స్త్రీ పొందే బానిసత్వాన్ని ఈ కథ చూపుతుంది. ముప్పాళ్ళ రంగనాయకమ్మ రాసిన జానకి విముక్తి నవలను ఈ కథ మరోసారి గుర్తు చేస్తుంది. అంతేకాదు రంగానయకమ్మ గారన్నట్లు మహిళపై ఆధిపత్యం కేవలం పురుషుడు మాత్రమే కాదు ఒక్కోసారి మరో స్త్రీ కూడా చేస్తుందిమహిళని శ్రమదోపిడీ చేసే స్త్రీలు అంటారు. ఆ విధమైన పాత్రలే **ఆమె-అతడు** కథలోని పూజ యొక్క ఆత్త , ఆడపడుచులు ఇందులో ఆడపడుచు పెళ్లి అయినా కూడా పుట్టింట్లోనే ఉంటుంది తమ్ముడి సంపాదన పైనే బ్రతుకుతుంది. కానీ తమ్ముడి భార్య అయిన పూజను మాత్రం ఆదరించదు పైగా ఆమెతో తల్లీ కూతుళ్ళు పనిమనిషిలా సేవ చేయించుకుంటారు . బారసాల సమయంలో పూజకు చీర కూడా కొనరు ఇవన్నీ సమాజంలో సాదారణంగా ఎన్నో కుటుంబాలలో జరుగుతాయి. ఆ కుటుంబాలలోని పూజ వంటి అమ్మాయిల మానసిక వేదనను, శ్రమ దోపిడీకి గురయ్యే జీవితాలను ఎవరూ పట్టించుకోరు . శరత్ జ్యోత్స్నా రాణి ఆమె వేదనకి అక్షరరూపం ఇచ్చి సమాజం బాద్యత ఏమని నిలదీస్తుంది. అత్తా ఆడపడుచుల పై పోలీసు కేసు పెట్టమనే సలహా ముగింపులో ఒక గొప్ప మలుపు అనవచ్చు. స్త్రీవాదంలో మరో కోణం చూపిన కథగా ఆమె-అతడు ను చెప్పవచ్చు.

**తియ్యని బహుమతి** కథలో జానకి తనకు తన కుటుంబమే సర్వస్వం అనుకుంటుంది. భర్తకు కూతుళ్ళకు సేవలు చేయడంలోనే అనురాగం అనుభవిస్తుంది. కానీ అనుకోకుండా ఆమెకి సంభవించిన వ్యాధితో జానకి వీల్ చైర్ కే అకితం అవుతుంది. అప్పుడు కానీ తన గురించి తన భర్త, కూతుళ్ళు ఏమనుకుంటున్నారో తెలుసుకోదు. ఆమె. సేవలు పొందిన కుటుంబం ఆమెను ద్వేషించడం గమనిస్తుంది. వాళ్ళు తన సేవలనే పొందారు కానీ తనను ఆప్యాయతతో చూడలేకపోయారని గమనిస్తుంది.సమయానికి సమకూర్చే రోబోలా తప్ప ఆత్మీయత పంచే అమ్మను, భార్యను వాళ్ళు చూడలేదు. పుట్టిన రోజున కూడా భర్త, కూతుళ్ళ నిరాదరణకు గురవుతుంది. పురుషుడు అనారోగ్యం పాలయినప్పుడు స్త్రీ సేవలు చేస్తుంది కానీ స్త్రీ అనారోగ్యం పాలయినప్పుడు ఏ పురుషుడు సేవలు చేయడు పైగా ఆ వ్యక్తిని అసహ్యించుకుంటాడు. అదే వాస్తవాన్ని తియ్యని బహుమతి కథ చెప్తుంది. "ఈ లోకంలో మగవాడి సంతోషాలకు భార్య సాధనమే కానీ ఏడడుగుల బంధానికి ఆడదాని జబ్బుకుఎలాంటి సంబంధాలుండవా! (పు- 48) అని ప్రశ్నిస్తుంది.

స్త్రీల పట్ల ముఖ్యంగా నిమ్న వర్ణాల స్త్రీల పట్ల కార్యాలయాల్లో జరుగుతున్న హేళనను ఆధిపత్య ధోరణిని **వెంటాడే నీడలు** కథ చెప్తుంది . ఇందులో ఒక ఉన్నత విద్యా నిలయంలో డిపార్ట్ మెంట్ హెడ్

అగ్రవర్ణం బాపనుడు. వాడు తోటి కొలీగ్స్ కుడా బాపనోల్లె. అక్కడకి దళిత వర్గానికి చెందిన స్త్రీ ఝూన్సీ లెక్చరర్ గా జాయిన్ అవుతుంది. అక్కడ హెడ్ నరహరి తనను తక్కువగా చూడటం సమయానికి వచ్చినా కుడా అవమానించడం, అదే తోటి కొలీగ్స్ అయిన బాపనోల్లను, పురుషులను తప్పు చేసినా కూడా ఏమి అనకపోవడం చూసి ఆశ్చర్య పోతుంది. చదువుకున్న వాళ్ళు, చదువు చెప్పే వాళ్ళ మనసులే ఇంత కల్మషంతో నిండి ఉండటం భరించ లేకపోతుంది. ఈ కులజాడ్యాన్ని గురించి చెల్లె ఇందిరకు ఉతరం రాయడం ద్వారా ఈ విషయాలను ఆమె పాఠకులకు తెలుపుతుంది. ఉత్తరం ద్వారా కథనం నడిపిన కథ వెంటాడే నీడలు.

స్త్రీ వాదాన్నే కాకుండా దళిత వాదాన్ని కుడా కొత్తగా చూపిన సంపుటిగా వెన్నెల చెప్పిన కథను చెప్పవచ్చు. '**చిచ్చు**' కథ లో కనకాచారి ప్రసన్నలు భిన్న ఉపకులాలకు చెందిన దళితులు. వాళ్ళు ఇష్టపడి వివాహం చేసుకుంటారు. కానీ భర్త తరువాతి కాలంలో తన కులానికి విలువ ఇవ్వడం జరుగుతుంది. పిల్లలకు తన కులం వారినే ఇచ్చి వివాహం చేయాలనీ అనుకుంటాడు. చివరకు భార్య ప్రసన్న వాళ్ళ అన్నయ్య మరణానికి కూడా వెళ్ళవద్దని వారించడంతో కనకాచారి వ్యక్తిత్వం ప్రసన్నకు తెలుస్తుంది. జంతువులలో ఆడా, మగా అనే లింగ బేధం తప్ప మాల మాదిగ, కుమ్మరి, కమ్మరి, చాకలి, కమ్మ, కాపు, రెడ్డి అనే జాతులుండవనుకుంటాను. ... సంఘర్షణ వచ్చి వారికి మిగిలేది శూన్యమే ." (పు- 61) అని ప్రసన్న తన స్నేహితురాలు కావ్యతో దాంపత్య జీవితంలో కులం వలన వస్తున్న మార్పును చెప్తుంది.

అలాగే తెలంగాణ వాదాన్ని కూడా మరో కోణంలో చూపిన కథ **తెగతెంపులు** ఇందులో రామశాస్త్రి సుశీల తెలంగాణ ఆంధ్ర ఏరియాకి చెందినవారు వీరికి వివాహం జరిగి పిల్లలు కూడా పెద్దవాళ్ళయి సెటిల్ అవుతారు. కానీ తెలంగాణ ఉద్యమం తరువాత భర్త ఆంధ్ర వాళ్ళను అతిగా విమర్శించడం తెలంగాణను దోచుకున్న వారంటూ తిట్టడం భరించ లేకపోతుంది సుశీల. పెళ్ళికి పనికి వచ్చే ఆంధ్ర ఆడవాళ్ళు అభివృద్ధికి ఎలా అడ్డుపడుతారు అనేది సుశీల ప్రశ్న. ఏరియా., కులం అనేవి మనిషిని దిగజార్చే నీచమైన విషమే కానీ మనిషికి పట్టెడన్నం పెట్టవురా" (పు-69) అని కొడుకు వంశీతో తన బాధ చెప్పుకొని సుశీల రామశాస్త్రిని విడిచి వెళ్ళిపోతుంది. అలాగే కులాన్ని అడ్డం పెట్టుకొని ఇతర కులం వారు ఒకే కులానికి చెందిన వారిని ఎలా రెచ్చ గోడుతారో చెప్పే కథ **కొలీగ్స్.** ఇందులో పున్నయ్య పాత్ర కేంద్రంగా వీరరాజు నల్లబాబు అనే విద్యార్థిని హెడ్ కరుణపైకి యుద్ధానికి పంపడం, సంస్థ అపఖ్యాతికి పథకం పన్నడం ఉంటుంది. నేటి యూనివర్సిటీలలో జరిగే కొన్ని సంఘటనల ప్రతిఫలనం ఇందులో కనిపిస్తుంది.

మానవ బంధాల్లోని తియ్యని తనాన్ని చెప్పే కథ **జ్ఞాపకాలపెట్టె** ఇందులో ట్రంకు పెట్టెలను గురించి శ్రీలు అవి మా సంపదకు చిరునామా, మా మమతకు ప్రతి రూపాలు అనడం ద్వారా కుటుంబంలో మనుషుల అనురాగానికి గుర్తుగా చిన్న వస్తువులు ఎలా ముఖ్యం అవుతాయో తెలుస్తుంది. ఈ మధ్యన వచ్చిన వీరాంజనేయులు విహార యాత్ర సినిమాలో కథానాయకుడు వాళ్ళ ఇంటిని అమ్మేయాలని నిర్ణయించు కోవడం ఆ ఇంటితో కుటుంబ సభ్యులు పొందిన తాదాత్మ్యం ఎంత హృద్యంగా ఉంటుందో అలాంటి భావనను ఈ జ్ఞాపకాల పెట్టె గుర్తు చేస్తుంది.

**సంభాషణలు :** శరత్ జ్యోత్స్నారాణి చాలా కథల్లో విలువైన ఆలోచించ తగిన అంశాలను ఉత్తమ సంభాషణల ద్వారా కథల్లో ప్రయోగిస్తారు. తన వారిని గుడ్డిగా నమ్మే అధికారుల గురించి వెంటాడే నీడలు కథలో "వాళ్ళు అగ్నిలో దూకమన్నా దూకుతాడు కానీ సిన్సియారిటీని గుర్తించలేని మూర్ఖుడు" అంటుంది ఆమె- అతడు కథలో కొన్ని

కుంటుంబాలలో మగబిడ్డ ప్రతినెల డబ్బు పంపక పోతే కన్నబిడ్డలను చూడకుండా ఒకటే శాపనార్థాలు పెట్టే అమ్మానాన్నలున్నారురా! ముఖ్యంగా నిన్న కన్నాం, పెంచాం, చదివించాం అంటూ బ్లాక్ మెయిల్ చేసే అమ్మానాన్నల సంఖ్య బాగా పెరిగి పోయింది ( పు-90 )తియ్యని బహుమతిలో “మగవాడు తన సుఖాన్ని తాను వెతుక్కుంటుంటేస్త్రీ మమకారంతో కుటుంబాన్ని కాపాడుకుంటూ ముందుకెళుతుంది” (పు.48) ఇలా ఆమె ప్రయోగాలు నిప్పు కనికల్లా నిజాన్ని చాటుతాయి.

**కథా నిర్మాణ వ్యూహాలు:** శరత్ జ్యోత్స్నారాణి గారు కథల నిర్మాణంలో ఎక్కువగా ఫ్లాష్ బ్యాక్ కథనం ప్రయోగించడం చూడవచ్చు. అలాగే కథానాంశము, ఘటనాంశాల కూర్పులో ఆకర్షనీయతను ప్రకటించారు . మూలం అయిన సంఘటన మొదటే తీసుకుంటారు దాన్ని వివరించే క్రమంలో కథనాంశము చెప్పడం ఉంటుంది. ఉత్తరాల ద్వారా కథనం, ఫోన్ సంభాషణ ద్వారా కథనం నడిపారు. దాదాపుగా అన్ని కథలు ప్రథమ పురుష కథనంలోనే నడిచాయి. అన్ని కథల్లో సులభమైన వ్యవహార భాష ఉపయోగించారు. దీర్ఘమైన వాక్యాలు కూడా ఉండవు. మానవ జీవన వేదనకు ప్రతిఫలనంలా ఉండే కథలు గనుక హృద్యమైన సుకుమార పదాలే ఉపయోగించడం జరిగింది. సన్నివేశ నిర్వహణలో లాలిత్యము అమ్మతనం కనిపిస్తుంది.

**ముగింపు:** శరత్ జ్యోత్స్నారాణి ‘వెన్నెల చెప్పిన కథ’ సంపుటి ఆధునిక జీవితపు అనుభవాలు. సమాజ గమనంలో, వేగవంతమైన మానవ జీవితంలో, స్వార్థంతో పరితపించే మనుషుల మధ్యన నిజాయితీ కలిగిన హృదయాలు పడే సంఘర్షణకు ఇవి సజీవ సాక్ష్యాలు. ఇందులోని కథల్లో సాహిత్య ధోరణులు కొత్త కోణంలో ఆవిష్కృతం కావడం వలన కళ్ళముందు జరుగుతున్న విషయాలకు ముసుగు వేసి చిరునవ్వుతో నటించే మనుషుల ప్రవర్తనను నగ్నంగా నిలబెట్టే నిజాలు అయ్యాయి. ఈ కథలు సాధించే విజయం మానవ ప్రవర్తనలో మార్పు.

## ఉపయుక్త గ్రంథాలు

**1. ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం నాల్గవ సంపుటి, తెలుగు అకాడమి, హైదారాబాద్**
**2 ఇనాక్ కొలకలూరి ఆధునిక విమర్శ సూత్రం మారుతీ బుక్ హౌజ్, గుంటూరు.**
**3. చంద్ర శేఖర రెడ్డి రాచపాళెం,కే. దళిత కథలు, విశాలాంధ్ర, హైదారాబాద్.**
**4.దక్షిణామూర్తి పోరంకి, కథానిక స్వరూప స్వభావాలు, నవోదయ, విజయవాడ**

| Access this Article in Online | |
|---|---|
| Quick Response Code | Website: www.ijarm.com |
| | Subject: తెలుగు సాహిత్యం |
| DOI:10.22192/ijamr.2024.11.11.006 | |

ఈ కథనాన్ని ఎలా ఉదహరించాలి :
**డా. తన్నీరు సురేశ్**. (2024). **వెన్నెల చెప్పిన కథ- సాహిత్య ధోరణుల అధ్యయనం**. Int. J. Adv. Multidiscip. Res. 11(11): 51-55.
DOI: http://dx.doi.org/10.22192/ijamr.2024.11.11.006